సాక్షి
పల్నాడు

శనివారం । 7 । జూన్ । 2025



ప్రసన్నాంజనేయుడికి అభిషేకాలు

ఫిరంగిపురం: వేమవరంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 21వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు.



క్యూఆర్ కోడ్ బోర్డులు ఏర్పాటు

విజయపురిసౌత్: పర్యాటక కేంద్రం నాగార్జునకొండలో క్యూ ఆర్ కోడ్ బోర్డులను ఏర్పాటు చేసినట్లు నాగార్జునకొండ కన్జర్వేటివ్ అసిస్టెంట్ వెంకటయ్య తెలిపారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: లాలాపేట శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. స్వామి వారిని పెళ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా మెగా డీఎస్సీ పరీక్షలు



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లాలో మెగా డీఎస్సీ– 2025 పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రం నరసరావుపేట పరిధిలో ఏర్పాటు చేసిన 5 కేంద్రాలకు తొలిరోజు 3 చోట్ల పరీక్ష నిర్వహించారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, ఎంఏఎం ఇంజినీరింగ్ కళాశాల, ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాలలో 460 మంది అభ్యర్థులకు 404 మంది హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఎంఏఎం ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాన్ని పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సిబ్బంది ఉన్నారు.

చివరి దశకు సాగర్ క్రస్ట్‌గేట్ల మరమ్మతులు

విజయపురి సౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్‌గేట్ల మరమ్మతులు పూర్తి కావచ్చాయి. సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 590 అడుగులు కాగా, 546 అడుగుల వద్ద నుంచి 26 రేడియల్ క్రస్ట్‌గేట్లు ఉంటాయి. రెండు, మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి ట్రయల్‌రన్‌కు ప్రాజెక్టు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటివరకు గేట్లకు పట్టిన తుప్పు వదిలించటంతోపాటు క్రాక్‌లు, వెల్డింగ్ జాయింట్‌లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేస్తున్నారు. గత ఏడాది వరద నీరు అధికంగా వచ్చి పలు మార్లు ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో రబ్బర్ సీళ్లు బాగా దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్తవి మారుస్తున్నారు. గేట్లకు గ్రీజింగ్, ఆయిలింగ్ పనులు చేస్తున్నారు. విద్యుత్ సరఫరా అయ్యే ప్యానల్ బోర్డులు తనిఖీ చేస్తున్నారు. మరమ్మతులు పూర్తి కాగానే రేడియల్ క్రస్ట్‌గేట్లకు అధికారులు ట్రయల్ రన్ చేస్తారు.

జూలై 5న లోక్ అదాలత్



నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదం పాల్ అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని జూలై 5న నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం



తాడేపల్లి రూరల్ : మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని మహానాడు 14వ రోడ్డులోని సంతాన వేణుగోపాల స్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమయ్య, బాలకోటయ్య, చిన్నయ్య, విజయ్, దొడ్డిపాటి వెంకటేశ్వరరావు, జానీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో యాదవ కార్పొరేషన్ చైర్మన్...
సంతాన వేణుగోపాలస్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహాయాదవ్ పాల్గొన్నారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, భారత యాదవ సంఘం చైర్మన్ లాకా వెంగళరావు, యాదవ భక్తులు పాల్గొన్నారు.

కూటమి దగా.. రైతులపై పగ

ఎన్నికల సమయంలో కూటమి తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి రైతుకు ఏటా పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు అందించాలి. పల్నాడు జిల్లాలో 2,80,181 మందికి ఇప్పటికే ఏడాదికి రూ.560.36 కోట్లు చెల్లించాల్సి ఉంది. సీఎం చంద్రబాబు ఆ దిశగా కనీస చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. దీంతో అప్పులు చేస్తూ ఖరీఫ్ సాగుకు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.



- అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కరికీ అందని నయాపైసా
- ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు కూటమి నేతల జీద అరుపులు
- ఏడాది గడిచినా అమలు ఊసే ఎత్తని సీఎం చంద్రబాబు
- జిల్లా రైతులకు రూ.560.36 కోట్ల మేరకు ఇప్పటికే ఎగనామం
- పెట్టుబడి సాయం అందక 2.80 లక్షల మంది అన్నదాతలకు కష్టాలు
- ఖరీఫ్ సాగుకు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద తప్పని అప్పులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లలో రైతులకు రూ.1738 కోట్లు లబ్ధి

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

నరసరావుపేట రూరల్: ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలకు పెట్టుబడి కోసం రైతు భరోసా పథకాన్ని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ అధికారం చెపట్టిన మొదటి సంవత్సరమే రైతులకు పథకాన్ని అమలు చేశారు. ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్లపాటు వారి ఖాతాల్లో నగదు జమ అయింది. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20 వేలు అందిస్తామని గత ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటే మరిచిపోయారు. ఏడాది గడిచినా ఎప్పుడిస్తారో కనీసం ఊసే లేదు. ఖరీఫ్ ప్రారంభమవుతున్న దృష్ట్యా పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. అధిక వడ్డీకి రుణాలు తీసుకుంటున్నారు. జిల్లాలో పెట్టుబడి సాయం కోసం 2,80,181 మంది రైతులు ఎదురుచూస్తున్నారు. రూ.20 వేల చొప్పున సర్కారు చెల్లించాల్సి ఉంది. రెండో ఏడాదిలో ఖరీఫ్ ప్రారంభం అవుతున్నప్పటికీ గతేడాది సాయం ఇంకా మంజూరు చేయకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

నాడు మూడు విడతల్లో నిధులు

వైఎస్ జగన్ సర్కారు ఖరీఫ్ సాగుకు ముందే ఏటా మే నెలలో వైఎస్సార్ రైతు భరోసా కింద తొలి విడతలో రూ.7,500 అందించింది. తర్వాత అక్టోబర్ నెలలో పంట కోతతోపాటు రబీ సాగు అవసరాలకు రెండో విడతలో రూ.4 వేలు, జనవరి నెలలో ధాన్యం ఇంటికి చేరే సంక్రాంతి సమయంలో మరో రూ.2 వేలు.. ఇలా మొత్తం రూ.13,500 చొప్పున వారి ఖాతాల్లో జమ చేసింది. కూటమి వచ్చాక గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఏడాది రైతులు తీవ్ర కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. విత్తనాలు, ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధిక ధరకు కొనుగోలు చేయడంతో అదనపు భారం పడింది. ఇన్ని కష్టాల మధ్య పంటలు పండించిన రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

వైఎస్ జగన్ హయాంలో 'భరోసా'

గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద నిధులు అందించింది. పల్నాడు జిల్లాలో ఐదేళ్లలో ఏకంగా రూ.1,738.58 కోట్లను నేరుగా రైతుల ఖాతాలలో నిరాటంకంగా జమ చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుచూపుతో రైతులకు ఎంతో భరోసా లభించింది. ఏటా అందించిన సాయం పట్టికలో చూడొచ్చు.

ఏడాది	రైతుల సంఖ్య	పొందిన లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	2,41,515	326.04
2020-21	2,50,469	338.13
2021-22	2,48,812	335.90
2022-23	2,66,871	360.27
2023-24	2,80,181	378.24
మొత్తం		1,738.58

ఇప్పటికే రూ.560.36 కోట్లు ఎగనామం

ఒకవైపు భారీ వానలు, తుపానుల రూపంలో ప్రకృతి విపత్తులు, చీడపీడలు వంటి సమస్యలు దాటి దిగుబడి వచ్చిన కొద్ది మొత్తానికైనా గిట్టుబాటు ధర లేక రైతులు వేదన చెందుతున్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి ఇస్తామన్న పెట్టుబడి సాయం ఒక్క పైసా వచ్చింది లేదు. పంట నష్టపోయిన వారికి పరిహారం ఇచ్చిన నాథులే లేరు. ఎంతవరకు మాటల్లో కోతలు తప్ప క్షేత్రస్థాయిలో అన్నదాతలకు ఒరిగిందేమీ లేదు. ఇప్పటికే ఏడాదికి రూ.560.36 కోట్లు ప్రభుత్వం ఎగనామం పెట్టింది. జిల్లాలో నియోజకవర్గాలవారీగా అన్నదాత సుఖీభవ అందాల్సిన రైతులు వివరాలను పట్టికలో చూడొచ్చు.

నియోజకవర్గం	రైతుల సంఖ్య
నరసరావుపేట	25,682
చిలకలూరిపేట	27,594
సత్తెనపల్లి	42,516
పెదకూరపాడు	47,255
గురజాల	42,202
మాచర్ల	46,422
వినుకొండ	48,510
మొత్తం	2,80,181

మిర్చి పంటకు మద్దతు ధర లేక పెట్టుబడి రాలేదు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మద్దతు ధరను క్వింటా రూ.18 వేలుగా ప్రకటించాలని అన్నదాతలు ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వంలో చలనం కలగలేదు. అలాగే పత్తి రైతులకు కూడా నష్టాలు తప్పలేదు. పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడితో అన్నదాతలు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. ఈ పరిస్థితుల్లో అండగా నిలవాల్సిన ప్రభుత్వం కనీసం రైతుల గోడును ఆలకించలేదు. జిల్లాలో ఎంపీతో సహా ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కరూ రైతులకు అండగా నిలవలేదు. కూటమి హామీ ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకంలో నిధులు విడుదల చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్‌సీపీ మాత్రమే రైతుల పక్షాన పోరాటం చేసింది.

ఏడాదైనా పైసా ఇవ్వలేదు




చంద్రబాబు ఏటా ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా పైసా ఇవ్వలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీకి మంగళం పాడారు. ప్రస్తుతం పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేక అప్పులు చేయాల్సి వస్తోంది.
– తొండెపి వెంకటేశ్వర్లు, రైతు, గణపవరం, నాదెండ్ల మండలం

మోసగించిన చంద్రబాబు



కూటమి ప్రభుత్వం బీద అరుపులు అరుస్తూ అన్ని వర్గాలనూ మోసం చేస్తోంది. అన్నదాత సుఖీభవ అమలు చేయకుండా రైతులను ముంచేసింది. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల నిరాటంకంగా రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లోనే నేరుగా పడ్డాయి.
– అన్నెం పున్నారెడ్డి, అధ్యక్షుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం

హామీ నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. లేదంటే వారి ఆగ్రహానికి గురి కాక తప్పదు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు అందజేస్తుందని చెప్పి, ఇప్పుడు కేంద్రం అమలు చేసే పథకంతో కలిపి ఇస్తామంటోంది. మామూలు రైతులతోపాటు కౌలు రైతులకు కూడా వర్తించేలా వెంటనే పథకం అమలు చేయాలి.
– ఏపూరి గోపాలరావు, ఏపీ రైతు సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి

8న వృద్ధులతో 'యోగాంధ్ర'

జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావుపేట: జిల్లా కేంద్రం నరసరావుపేటతో పాటు సత్తెనపల్లి, పిడుగురాళ్ల పట్టణాలలో కూడా ఈ నెల 8వ తేదీన సీనియర్ సిటిజెన్లతో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. వృద్ధుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమంపై అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 9వ తేదీన గ్రామాలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీలలో యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా 5 వేల ప్రాంతాల్లో ఏకకాలంలో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు స్థలాలను ఎంపిక చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. యోగాంధ్ర యాప్ ద్వారా ఔత్సాహికులకు సంబంధిత శిక్షకులను మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.

శారీరక రుగ్మతలు మాయం

యోగా సాధన వల్ల మానసిక ఒత్తిడి తొలగడంతో పాటు శారీరక రుగ్మతలు తగ్గుతాయని ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ వెంకటరమణ అన్నారు. జాతీయ యోగా డేలో భాగంగా శుక్రవారం పల్నాడు బస్టాండ్ పెద్దచెరువు రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బందితోపాటు సుమారుగా 200 మందికిపైగా ప్రజలు పాల్గొని యోగాభ్యాసం చేశారు. ఏ ఇతర శాఖలకు లేని అవకాశం అటవీ శాఖకు ఉందని, ఎప్పుడూ అడవుల్లో తిరుగుతూ సహజసిద్ధమైన గాలిని పీల్చుకునే అటవీశాఖ ఉద్యోగులకు ఇదో మంచి అవకాశం అని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ ఎంతో కొంత సమయం కేటాయించి యోగా సాధన చేయాలని తెలిపారు. ఫారెస్ట్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మండల రెవెన్యూ అధికారి కె.వేణుగోపాలరావు, సిబ్బంది, యోగా ట్రైనర్లు పాల్గొన్నారు.




యోగాసనాలు వేస్తున్న అటవీశాఖ సిబ్బంది, ప్రజలు

రాజధానికి భూములిచ్చేదే లేదు

- పూలింగ్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న లేమల్లె రైతులు
- ఉపాధి కల్పిస్తున్న భూమి ఇచ్చి ఏం చేయమంటారని నిలదీత
- వ్యవసాయం తప్ప వేరే పని తెలియదంటున్న అన్నదాతలు
- ఈ భూమిపైనే పిల్లల భవిష్యత్ ఆధారపడి ఉందని ఆవేదన
- రెవెన్యూ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేత

అమరావతి: తరతరాలుగా అనుభవిస్తున్న భూములను రాజధాని నిర్మాణంలో భాగంగా పూలింగ్‌కు ఇవ్వటానికి తాము అంగీకరించటం లేదని లేమల్లె గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన సన్న, చిన్నకారు రైతులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్‌తోపాటుగా సత్తెనపల్లి ఆర్డీవో, అమరావతి తహసీల్దార్‌కు ఈ మేరకు వినతిపత్రాలు సమర్పించారు. మండల పరిధిలోని కర్లపూడి రెవెన్యూ గ్రామంలో భాగమైన లేమల్లెకు చెందిన సుమారు 100 సర్వే నంబర్లలో ఉన్న 500 ఎకరాలకు చెందిన 170 మంది రైతుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని రైతులు అధికారులకు సమర్పించారు. ఆ వినతి పత్రంలో... తమకు వ్యవసాయం తప్ప వేరే పని తెలియదని వాపోయారు. పూర్తిగా గ్రామీణ జీవితానికి అలవాటు పడి జీవిస్తున్నామని చెప్పారు. తమకున్న కొద్దిపాటి భూమికి మరికొంత కౌలుకు తీసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. పిల్లల చదువు, వివాహాలకు వ్యవసాయం ద్వారా ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నామని వివరించారు. భూములను పూలింగ్‌కు ఇవ్వటానికి సిద్ధంగా లేమని తెలిపారు. పంటలు పండించుకుని ఉపాధి పొందుతూ జీవనం సాగించటానికి నిర్ణయించుకున్నామని తెలిపారు.



పల్నాడు జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన వినతి పత్రం

ఇస్తే మాకు అన్యాయమే



ఇంతకు ముందు రాజధానిలో పొలాలు ఇచ్చిన రైతులకు న్యాయం చేయలేదు. మా భూములకు రేట్లు లేకుండా చేశారు. వ్యవసాయం తప్ప వేరే పని తెలియని వాళ్లం. పత్తి, మిరప వంటి పంటలు పండించుకోకుండా పూలింగ్‌కు ఇస్తే మా జీవనం సాగడం కష్టమే.
– షేక్ రహిమాన్, రైతు, లేమల్లె

ఇతర పనులకు వెళ్లలేం




పార్టీలకు అతీతంగా పూలింగ్‌ను వ్యతిరేకిస్తున్నాం. పొలం పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. పనుల కోసం ఎక్కడికో వెళ్లి బతకలేం. సస్యశ్యామలంగా పంటలు పండించుకుంటున్న భూములను ఎవ్వరికీ ఇవ్వబోం.
– చిల్కా రమేష్, రైతు, లేమల్లె

విశ్వాసానికి త్యాగానికి ప్రతీక

- మానవతా వెలుగుతో ఉదయించాలన్నదే అల్లాహ్ సందేశం
- బక్రీద్–శాంతి సందేశం, మానవతా దీప్తి



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం చిన్నారులు



యడ్లపాడు: పవిత్ర రంజాన్ పర్వదినం అనంతరం ముస్లింల జీవితాల్లో మరొక ఆధ్యాత్మిక సందడిని నింపే పండుగ బక్రీద్. 'బకర్' అంటే జంతువు, 'ఈద్' అంటే పండుగ– రెండింటి కలయికే బక్రీద్. ఇది ఖుర్బానీ (బలిదానం) పండుగ కూడా. అందుకే దీనిని 'ఈదుల్ ఖుర్బానీ' లేదా 'ఈద్ ఉల్ అదా'గా పిలుస్తారు. రంజాన్ తర్వాత 70 రోజులకు వచ్చే ఈ పండుగకు జిల్లాలోని ఈద్గాలు, మసీదులను మత పెద్దలు సిద్ధం చేశారు. శనివారం బక్రీద్ పండుగ జరుపుకోవాలని ప్రకటించారు. బక్రీద్ ముందు రోజు 'అరఫా' దినంగా భావిస్తారు. ఇది అల్లాహ్ ప్రేమ పొందడానికి అత్యంత శ్రేష్ఠమైన దినం. నరకం నుంచి విముక్తి కోరుతూ ఆ రోజు ఉపవాసం ఉండటం ద్వారా చిన్నచిన్న పాపాలు కూడా క్షమించబడతాయని ముస్లింల విశ్వాసం. ఇదే రోజున చనిపోయిన తమ పెద్దల్ని స్మరించుకుంటూ పెద్దల పండుగ నిర్వహించుకుంటారు. అంతేకాదు ప్రతి ముస్లిం తన జీవితంలో ఒక్కసారైనా పవిత్ర మక్కా యాత్ర చేయాలన్నది మత విధి. అది ఈ పర్వదినం నాడే చేయడం జరుగుతుంది.

ఈ పండుగలోనే హజ్‌యాత్ర...

ఇస్లాం మతంలోని ఐదు మూల స్తంభాల్లో హజ్ యాత్ర ఒకటి. ఈ పర్వదినం ప్రాముఖ్యత, హజ్ యాత్రతో మొదలవుతుంది. ఇస్లాం క్యాలెండరులో చివరి నెల 'జిల్‌హిజ్'. ఈ నెల 9వ రోజున హజ్ యాత్ర ప్రారంభమవుతుంది. ఈ యాత్రలో భాగంగా మక్కా, మదీన క్షేత్రాలను దర్శించుకుంటారు. మక్కాలోని కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు, ఆధ్యాత్మిక శుద్ధికి సంకేతం. ఇది కేవలం ఓ యాత్ర మాత్రమే కాదు –ఇది ఆత్మాన్వేషణకు ఆరంభమైన సాధన. తనలోని స్వార్థాన్ని వదిలి, మానవతా మార్గంలో పయనించాలనే సంకల్పంతో చేసే యాత్ర ఇది. ఆ మరుసటి రోజునే బక్రీద్ జరుపుకుంటారు.

నిరుపమానమైన త్యాగానికి ప్రతీక– ఖుర్బానీ...

మక్కా నగరంలో హజరత్ ఇబ్రహీం ప్రవక్తకు ముదిమి వయసులో కలిగిన ముద్దుల పుత్రుడు ఇస్మాయిల్‌ను అల్లాహ్‌కు బలిదానం చేసేందుకు సిద్ధమైన పవిత్ర ఘటనను స్మరిస్తూ బక్రీద్ నిర్వహిస్తారు. చివరికి, అల్లాహ్ ప్రత్యక్షమై, ఇస్మాయిల్ బదులు ఒక పొట్టేలును ఖుర్బానీ చేయాలని ఆదేశించాడు. అప్పటి నుంచి ఈ పండుగను జీవన త్యాగానికి జ్ఞాపకంగా జరుపుకుంటూ వస్తున్నారు.

ఖుర్బానీ ఎవరు, ఎలా చేయాలి

బక్రీద్ పండుగలో ఖుర్బానీ అత్యంత పవిత్రమైన ఆచారం. దానిని ధనంతో కాదు, మనసుతో చేసే త్యాగమే నిజమైన అర్పణ. ఖుర్బానీ ఇచ్చిన పొట్టేలు మాంసం మూడు భాగాలుగా విభజించి పేదలు, బంధువులు, మూడో భాగాన్ని తామే తీసుకోవాలి. చనిపోయిన వారి పేరుతో ఖుర్బానీ చేయాలంటే ఆ మాంసం పూర్తిగా ఇతరులకే పంచాలి. ఇది కేవలం మాంసం పంచడం కాదు, మానవతా భావన పంచడంగా భావిస్తారు. 52 తులాల వెండి లేదా 7.5 తులాల బంగారం కలిగిన ముస్లింలు విధిగా ఖుర్బానీ చేయాలి.

ఈద్ నమాజ్ ఇలా..



పండుగ రోజున ఫజర్ నమాజ్‌ను తమ వీధిలోని మసీదులోనే విధిగా చదవాలి. పరిశుభ్రంగా, మంచి దుస్తులతో అత్తర్, సుర్మా రాసుకుని దారి పొడవునా 'తక్బీర్' చదువుతూ తమ ప్రాంతంలోని ఈద్గాకు వెళ్లి మాత్రమే సామూహిక నమాజ్ చేయాలి. ఈద్ నమాజ్ అయ్యే వరకు ఏమీ తినరాదు. ఈద్గా వద్దకు వెళ్లి, వచ్చే మార్గాలు వేర్వేరుగా ఉండాలి. ఈద్ నమాజ్ తర్వాతనే ఖుర్బానీ ప్రక్రియ ప్రారంభించాలి. వాటిని స్వీకరించాలి.
– అబ్దుల్ కలీమ్, ముఫ్తీసాబ్

క్లుప్తంగా

కలెక్టర్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

నరసరావుపేట: బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ముస్లిం ప్రజలకు శుక్రవారం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సామాజిక ఐక్యత, స్నేహాన్ని పెంపొందించే సందర్భమని పేర్కొన్నారు. అందరూ సంతోషంగా, ప్రశాంతంగా పండుగను నిర్వహించుకోవాలని సూచించారు.

వినుకొండ నియోజకవర్గ మండల అధ్యక్షుల నియామకం



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వినుకొండ మున్సిపాలిటీకి కొత్తమాసు వెంకట సాంబశివరావు, వినుకొండకు దండు చెన్నయ్య, బొల్లాపల్లికి కాకర్ల పెద్దనారాయణ, ఈపూరుకు కొండవర్జు నాగేశ్వరరావు, శావల్యాపురానికి బోడెపూడి వెంకటేశ్వర్లు, నూజెండ్లకు ముప్పరాజు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. అలాగే పిడుగురాళ్ల మున్సిపల్ అధ్యక్షుడిగా ఎం.కిరణ్ కుమార్‌ను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.

ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 9వతేదీ లోపు సంబంధిత పాఠశాలలో సంప్రదించి అడ్మిషన్ పొందాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వి.సుబ్బారావు శుక్రవారం తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలో 300 మంది విద్యార్థులు ఉచిత ప్రవేశాలకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు తగిన ఆధారాలతో పాఠశాలకు వెళ్లి తమ అడ్మిషన్‌ను ధృవపరుచుకోవాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తగిన కారణం లేకుండా అడ్మిషన్‌ను తిరస్కరించరాదని, తిరస్కరించిన పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండలాధికారులు చేరిన, చేరని విద్యార్థుల జాబితాను 9వతేదీ లోపు స్వయంగా వచ్చి సమర్పించాలని తెలిపారు.

కోర్టు మానటరింగ్ వ్యవస్థను పటిష్ట పరుస్తాం

- రెండు నెలల్లో ఎనిమిది కేసుల్లో ముద్దాయిలకు కఠిన శిక్షలు
- మెరుగైన కోర్టు విధానం ద్వారా సత్వర న్యాయం
- ఎస్పీ కె.శ్రీనివాసరావు


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: భవిష్యత్‌లో కోర్టు మానిటరింగ్ సిస్టంను మరింత పటిష్టం చేస్తామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో గడిచిన రెండు నెలల కాలంలో కోర్టులో శిక్షలు పడిన కేసుల వివరాలు తెలియజేశారు. జిల్లాకు సంబంధించిన ఎనిమిది కేసులలో ఏడు కేసుల్లోని ముద్దాయిలకు జీవితఖైదు, ఒక కేసులో మరణశిక్షను విధించినట్టు తెలిపారు. సంవత్సర కాలం నుంచి ట్రైల్ ప్రక్రియ జరుగుతున్న కేసులకు సంబంధించి కోర్టు మానిటరింగ్ సిస్టంను పటిష్టంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమయానికి సాక్షులను ప్రవేశపెట్టడం, జరుగుతున్న వాదోపవాదాలు సమగ్రంగా పరిశీలన చేయడం, అయా కేసులకు సంబంధించి మరుసటి వాయిదాకు సిద్ధం కావడం వంటి అంశాలలో ప్రణాళిక బద్ధంగా పోలీసులు వ్యవహరించినట్టు పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ కూడా వీటి పట్ల ప్రతిస్పందించడంతో ఈ తీర్పులు రావడం జరిగిందని తెలిపారు.

ప్రార్థనా మందిరాల వద్ద పటిష్ట బందోబస్తు

బక్రీద పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ముస్లింలకు బక్రీద పండుగ శుభాకాంక్షలను ఆయన తెలియజేశారు. పండుగ ప్రార్థనలు జరిగే మసీదులు, ఈద్గాలు ఇతర కీలక ప్రాంతాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా గో సంరక్షణ చట్టం 2017 అమలులో ఉందని తెలిపారు. గోవులను వధించడం పూర్తిగా నిషేధమని ఈ చట్టాన్ని ఎవరైన అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైన రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, షేర్ చేసే ముందు ఆలోచించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల గ్రూపులలో వచ్చే సందేశాలు, దృశ్యాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

పోలీసుల వేధింపుల వల్లే వైఎస్సార్ సీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం పెద్దనెమిలిపురి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త గుత్తా లక్ష్మీనారాయణ ఆత్మహత్యాయత్నానికి పోలీసుల వేధింపులే కారణమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం రాత్రి ఆయన ఓ వీడియో విడుదల చేశారు. గుత్తా లక్ష్మీనారాయణ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి వీరాభిమాని అని, కొంత మంది టీడీపీ వారితో కలిసి వాయిదాల పై ఫర్నీచర్ ఇచ్చే వ్యాపారం చేశారన్నారు. వాళ్ళకి వాళ్ళకి గొడవలు వచ్చి పిడుగురాళ్ళకు సంబంధించిన రామారావు అనే టీడీపీ లీడర్‌తో ఫిర్యాదు చేయించారన్నారు. పోలీసు శాఖ లక్ష్మీనారాయణను వేధింపు లకు గురి చేయడం ప్రారంభించారన్నారు. ఆ ఆడియో కాల్స్ కూడా సోషల్ మీడియా లో వైరల్ అవుతున్నాయన్నారు. పోలీసులు ఫోన్‌లు చేసి వస్తున్నావా లేదా వారిని తీసుకు రా! అని అంటే, తాను బ్రతిమిలాడి ఇక్కడ లేనని వైజాగ్‌లో ఉన్నాని చెప్పినా నువ్వు రా ముందు వచ్చి సెటిల్ చేసుకో అని వేధించారన్నారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక మనోవేదనకు గురై ఆత్మహత్యకు యత్నించాడన్నారు. ఇదంతా ఒక రెడ్‌బుక్ పాలన వల్లేనన్నారు. లక్ష్మీనారాయణకు, ఆయన కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామన్నారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఈ వీడియోలు చూసైనా బాధ్యుల పై చర్యలు తీసువాలన్నారు.

టెన్త్ విద్యార్థులను 'కూటమి' బలిపశువులు చేసింది

- బాధ్యులపై చర్యలు చేపట్టాలి
- విద్యాశాఖాధికారికి వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ నాయకులు వినతి


జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళకు వినతిపత్రం అందజేస్తున్న ఆకాష్

నరసరావుపేట: తక్కువ సమయంలో ఫలితాలు వెల్లడి చేయాలన్న అత్యుత్సాహంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన బిల్డప్‌కి వేలాది మంది విద్యార్థులను కూటమి ప్రభుత్వం బలిపశువులుగా మార్చిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్ మండిపడ్డారు. ఎలాంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయాలని, తుది ఫలితాలు వచ్చేంతవరకు టెన్త్ మార్క్స్ ప్రాతిపదికగా చేస్తున్న అడ్మిషన్లను కొన్ని రోజులపాటు నిలిపివేయాలని, బాధ్యులైన అందరిపైనా చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారికి ఎల్.చంద్రకళకు వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆకాష్ మీడియాతో మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు రీ వెరిఫికేషన్ పెట్టుకుంటే వారికి ఏకంగా తొంభై మార్కులు వచ్చిన పరిస్థితిని ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నామన్నారు. 16 వేల మంది తమ పేపర్లను కరెక్షన్ చేయించుకుంటే దానిలో అధికశాతం అస్తవ్యస్తంగా పేపర్ల మూల్యాంకనం చేసినట్లుగా తేలిందని అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మంత్రి లోకేష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ ఉపాధ్యక్షుడు వేణు మాధవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూదాల కళ్యాణ్, బంటి, శివ కోటి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చి.. చేనేత పరిశ్రమను రక్షించండి

ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండ్



సత్తెనపల్లి: ఎన్నికల హామీలు నెరవేర్చి.. చేనేత పరిశ్రమను రక్షించాలని, కార్మికులను ఆకలి చావుల నుంచి కాపాడాలని కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమను సంరక్షిస్తామని, ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ చేస్తామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామంటూ హామీలిచ్చాయని చెప్పారు. కానీ ఇప్పటివరకు వాటిని నెరవేర్చలేదని మండిపడ్డారు. వాటిని నెరవేర్చడంతో పాటు చేనేత కార్మికులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కామర్తి రాజు, కట్టా శివ దుర్గారావు, డోకుపర్తి రామారావు, వాస గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో జిల్లాకు చాంపియన్‌షిప్

ప్రతిభ చూపిన జూనియర్ మెన్ క్రీడాకారులు


ప్రతిభ చూపిన క్రీడాకారులతో పసుపులేటి సురేష్, జిమ్‌రాజు

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి జూనియర్ మెన్ టీం చాంపియన్‌షిప్ సాధించింది. ఒంగోలు లోని డాక్టర్ పి.ఆనంద్ స్టేడియంలో 12వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకు మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్– బెంచ్ ప్రెస్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్, ఉమెన్ పోటీలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఈ పోటీలలో పల్నాడు జిల్లాకు చెందిన 8 మంది క్రీడాకారులు 10 బంగారం, 3 రజత, 2 బ్రొంజ్ పతకాలను మొత్తంగా 15 పతకాలను కైవసం చేసుకొన్నారు. జిల్లా ప్రతిష్టను చాటడమేగాక జిల్లా జూనియర్ మెన్ టీం చాంపియన్ షిప్ మొదటి స్థానం సాధించింది. సబ్ జూనియర్స్‌లో 47 కేజీల విభాగంలో గురజాలకు చెందిన కె.పల్లవి (సిల్వర్ మెడల్), 66 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఎం.వినయ్ వెంకట శివ (సిల్వర్ మెడల్), జూనియర్–సీనియర్ మెన్ విభాగంలో 74 కేజీల విభాగంలో వెన్నా దేవీకి చెందిన శరత్ 2 బంగారు పతకాలు, 74 కేజీ విభాగంలో కంకణాలపల్లికి చెందిన రమేష్ చౌదరి బ్రాంచ్ మెడల్, 83 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీ కృష్ణ 3 బంగారు పతకాలు, ఒక రజిత పతకం, 120 కేజీల విభాగంలో గుడిపూడికి చెందిన లింగిసెట్టి శివ నాగేశ్వర రావు నాలుగు బంగారు పతకాలు, సబ్ జూనియర్ మెన్ బెంచ్ ప్రెస్ విభాగంలో 53 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె కార్తీక్ సిల్వర్ పతకం,74 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన షేక్ మొహిద్దీన్ బంగారు పతకం సాధించారు. శరత్ (వెన్నాదేవీ), పసుపులేటి వంశీకృష్ణ రెండు, మూడవ స్థానాల్లో రాష్ట్రస్థాయిలో జూనియర్ స్ట్రాంగ్ మెన్‌టైటిల్ సంపాదించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ క్రీడాకారుడైన పసుపులేటి సురేష్, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ ప్రెసిడెంట్ జిమ్‌రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివ రావు, కత్తి పవన్, మాతంగి రాహూల్ గౌతమ్, జి రమేష్, శాంతయ్య, సత్తెనపల్లి పట్టణానికి చెందిన ప్రముఖులు శుక్రవారం క్రీడాకారులను అభినందించారు.

జాతీయ ప్రతిభా స్కాలర్‌షిప్‌కి ఎంపిక


షేక్ రెహానా


షేక్ ఆసిఫా

పెదకూరపాడు: జాతీయ ప్రతిభా స్కాలర్‌షిప్‌నకు పెదకూరపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఓ. రెహానా, జె.ఆసిఫ్ ఎంపికయ్యారు. వీరు ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నారు. జాతీయ ప్రతిభా స్కాలర్‌షిప్ ద్వారా ప్రతి సంవత్సరం రూ.12,000 నాలుగేళ్ల పాటు వరుసగా కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఆసిఫా రాష్ట్రస్థాయి హాకీ జట్టుకి రెండుసార్లు ఎంపికైంది. విద్యార్థులు ఎంపికపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ విద్యార్థులను అభినందించారు.

ప్రకృతి వ్యవసాయమే రైతులకు దిక్సూచి

జిల్లా వ్యవసాయ అధికారి ఐ. మురళీ


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీ

నరసరావుపేట రూరల్: రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామాల్లో ముందుకు తీసుకువెళ్లాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో సమన్వయంతో మూడో రోజు శిక్షణా కార్యక్రమం శనివారం బృందావన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులందరూ రసాయనాలు వీడి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అనుబంధ శాఖలు కలిసి కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం నుంచి పాల్గొన్న రామచంద్రన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం చేయడమే శరణ్యమని తెలిపారు. ప్రతి రైతు 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ విధానాన్ని ఆచరించాలని సూచించారు. ఈ విధానం ద్వారా భూమికి అన్ని రకాల సూక్ష్మజీవులు అందుబాటులోకి రావడంతో పాటు భూమి ఉత్పాదక శక్తి పెరుగుతుందన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ 28 మండలాల్లో132 గ్రామాల్లో ప్రతిష్ఠాత్మకంగా ప్రకృతి వ్యవసాయం కొనసాగుతుందని తెలిపారు. ఈ ఏడాది 82,619 ఎకరాల విస్తీర్ణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పీఎండీఎస్ కిట్స్ అందుబాటులో ఉన్నాయరని, రైతులు కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పంట సాగు చేస్తే మార్కెట్ ధర కన్నా అధిక ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమరాజు, మండల వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంతోనే మహిళ హత్య

- నిందితులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మొయిన్


మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్. పక్కన సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: వివాహేతర సంబంధం నేపథ్యంలోనే మానికల దీపిక అలియాస్ వేటగిరి ప్రమీల (24) ను అదే కాలనీకి చెందిన ఇద్దరు హత్య చేసినట్లు చీరాల డీఎస్పీ మొయిన్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళ హత్యకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శుక్రవారం వివరించారు. ఈ నెల 2వ తేదీన రామన్నపేట పంచాయతీ పరిధిలోని నాగవరపమ్మ దేవస్థానం వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం గుర్తించారు. అయితే రామన్నపేట పంచాయతీ వినాయకపురానికి చెందిన మానికల దీపిక అలియాస్ వేటగిరి ప్రమీల నెల రోజుల క్రితం అదృశ్యం అయినట్లు ఆమె అత్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో అదే కాలనీకి చెందిన ఈగ వెంకటేశ్వరరావు, సైకం నాగబాబు.. గద్దల గుంటకి చెందిన ఇద్దరు బావ బావమర్దులు. వీరిద్దరే చంపి ఉంటారని కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. వీరిద్దరిని శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించారు. కాగా గుర్తు తెలియని మహిళ విషయం తమకు తెలియదని, తాము దీపికను చంపి గ్రామ శివారులోని తోటలో పూడ్చి పెట్టినట్లు ఒప్పుకున్నారు. మృతురాలి భర్త చనిపోవడంతో వ్యసనాలకు బానిసైన ఆమె అత్త వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఆమె ఇంటి వద్దనే ఉంటున్న ఈగ వెంటేశ్వరరావుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. కొంత కాలానికి వెంకటేశ్వరరావు కొమరిగిరి రాములమ్మని వివాహం చేసుకున్నాడు. అనంతరం అదే కాలనీకి చెందిన సైకం నాగబాబుతో వివాహేతర సంబంధం పెట్టుకుని, వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేసింది. లేదంటే విషయం అందరికీ చెబుతానని బెదిరించడం మొదలు పెట్టింది. దీంతో ఈగ వెంకటేశ్వరరావు, సైకం నాగబాబులు ఆమెను చంపాలని నిర్ణయించుకున్నారు. ఏప్రిల్ 30వ తేదీన దీపికను బైక్ పై ఎక్కించుకొని పందిళ్లపల్లి– తిమ్మసముద్రం రోడ్ వరకు వెళ్లారు. అక్కడ ఆమెతో బీరు తాగించారు. అనంతరం బీరు సీసాతో తలపై కొట్టి.. అపస్మారక స్థితిలోకి వెళ్లగా.. మెడకు చున్నీ చుట్టి చంపివేశారు. శవాన్ని మూట కట్టి బైక్‌పై పెట్టుకొని రామన్నపేట శివారు తోటల్లోకి తీసుకొచ్చి పూడ్చి వేసినట్లు నిందితులు అంగీకరించారు. పూడ్చిపెట్టిన శవాన్ని తహసీల్దార్ సమక్షంలో తవ్వి బయటకు తీసి పోస్టుమార్టం చేయించారు. మోటార్ బైక్, దుస్తులు, మృతురాలి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరగా ఛేదించిన చీరాల రూరల్ సీఐ శేషగిరి రావు, ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు, ఎస్‌బీ హెచ్‌సీ అచ్చయ్య, తన్నీరు శ్రీను, పి.నరసింహారావు, ఎస్‌కే బాజీత్, పీసీ బాలచంద్రలను డీఎస్పీ అభినందించారు.

మావోయిస్టులను కోర్టులో హాజరు పరచాలి

సత్తెనపల్లి: అదుపులో ఉన్న మావోయిస్టులను తక్షణమే కోర్టుల్లో హాజరు పరచాలని ఏపీ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. చిట్టిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం రాత్రి వారు మీడియాతో మాట్లాడారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలోని ఒక గ్రామంలో గురువారం మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆడేళ్ల అలియాస్ భాస్కర్, బండి ప్రకాష్, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్, మద్దెడు ఏరియా కార్యదర్శి సీటు, రామన్న డీసీ మెంబర్, మున్నా, సునీత, మహేష్‌లతో పాటు 10 మంది మావోయిస్ట్ నాయకులను పోలీసులు ప్రాణాలతో పట్టుకున్నారు అని తెలుస్తుందన్నారు. గురువారం సుధాకర్‌ని, అలాగే శుక్రవారం సాయంత్రం భాస్కర్ కూడా చంపబడ్డారన్నారు. ఈ నేపథ్యంలో బండి ప్రకాష్‌తో పాటు మిగతా మావోయిస్టు నాయకులను కూడా ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి వారికి ఎలాంటి హాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పరచాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

విద్యార్థుల జీవితాలతో కూటమి చెలగాటం

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు వినోద్


డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న వినోద్‌కుమార్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడుతోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వినోద్‌కుమార్ విమర్శించారు. పదవ తరగతి మూల్యాంకాన్ని లోపభూయిష్టంగా నిర్వహించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంపాలెంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవి రేణుకను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పదో తరగతి పరీక్షల నిర్వహణలో అటు పాలకులు, అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఎటువంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యూయేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. తుది ఫలితాలు వచ్చే వరకు అడ్మిషన్‌లను కొన్ని రోజుల పాటు నిలిపివేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల విషయంలో జరిగిన తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన షేక్ శ్రీనివాసరావు(35)పై కొంతమంది వ్యక్తులు దాడి చేయగా తీవ్రగాయాలతో గుంటూరు ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ పి.రవిబాబు తెలిపారు. ఈనెల 3వ తేదీ అమరావతి మండలంలోని తురకవారిపాలెం ఇటుకబట్టీలలో పనిచేసుకుంటుండగా మునుగోడు గ్రామానికి చెందిన గోపి అనే వ్యక్తితో గొడవ జరిగింది. అనంతరం సాయంత్రం గోపి, మరి కొందరు కలిసి వచ్చి బయ్యవరంలోని శ్రీనివాసరావు ఇంటి పై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. శ్రీనివాసరావుకు తీవ్రగాయాలు కాగా గుంటూరు ప్రవేటు ఆసుపత్రిలో చేర్పించగా అక్రడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఒక్కరు కోవిడ్ జాగ్రత్తలు తీసుకోవాలి

గుంటూరు మెడికల్: కోవిడ్ కేసులు మళ్లీ నమోదవుతున్న దృష్ట్యా గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్న రోగులు, వారి సహాయకులు తప్పని సరిగా కోవిడ్ నిబంధనలు పాటించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో మీ కోసం మేము కార్యక్రమంలో భాగంగా ఆయన రోగులు, వారి సహాయకులతో సమావేశమై వారి సమస్యలు ఆలకించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరి ప్రాణాలు రక్షించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది తమ ప్రాణాలు పణంగా పెట్టి వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆస్పత్రిలో వాతావరణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరు తరచుగా చేతులు పరిశుభ్రం చేసుకోవాలని, దగ్గు, జలుబు, జ్వరం ఉంటే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. దగ్గు, జ్వరం ఉన్నవారు ఆస్పతిలో తిరగకుండా వార్డులో ఉంచి చికిత్స పొందాలని సూచించారు.